సాక్షి
విజయనగరం
శనివారం, 15, మార్చి, 2025



ఆపదలో ఆరోగ్యమిత్రలు..!

ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ) పథకంలో పనిచేసే ఆరోగ్య మిత్రలకు ఉద్యోగభద్రత కరువైంది. - 8లో



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ ఆందోళన చేసింది. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
శని (సా)	ఆది(ఉ)
6.11	4.42

న్యూస్‌రీల్

నేడు జిల్లా ప్రత్యేక అధికారి రాక

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి, సీనియర్ ఐఏఎస్, రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు జిల్లాలో శనివారం పర్యటించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకొని స్వర్ణాంధ్ర కార్యక్రమాలను పరిశీలిస్తారు. 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఆదాయార్జన శాఖల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంపుదలలో సాధించిన ప్రగతి, తదితర అంశాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

నేటితో చెరకు క్రషింగ్ పూర్తి



కర్మాగారానికి ట్రాక్టర్‌పై చెరకు తరలింపు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో శనివారంతో చెరకు క్రషింగ్ పూర్తవుతుందని కర్మాగారం యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ ప్రతిరోజు 4వేల పైచిలుకు టన్నుల చెరకు క్రషింగ్ చేశామని, ఇప్పటివరకు 3.50 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందన్నారు. రైతులు కర్మాగారానికి చెరకును తరలించిన వారం రోజులకే బిల్లులు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్టు వెల్లడించారు.

రికార్డు సృష్టికర్తకు సన్మానం



జయపవన్‌ను సత్కరిస్తున్న పుల్లెల శ్రీనివాసరావు

బొబ్బిలి: పాత బొబ్బిలికి చెందిన ఎంటెక్ విద్యార్థి 55 సెకెన్లలో హనుమాన్ చాలీసాను పఠించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెలగాడ తాతబాబు కుమారుడు జయపవన్ కళ్యాణ్ హనుమాన్ చాలీసాను నిత్య పఠనంగా మార్చుకుని పట్టుసాధించాడు. ఆన్‌లైన్ పోటీలో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఇతని ప్రతిభను గుర్తించి బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యుడు పుల్లెల శ్రీనివాసరావు, తదితరులు జయపవన్‌ను దుశ్శాలువతో సత్కరించారు.

రైతు బజార్లను పరిశుభ్రంగా ఉంచాలి

- వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ ఎం.వి.సునీత



రైతు బజార్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సునీత

విజయనగరం ఫోర్ట్: రైతు బజార్లను పరిశుభ్రంగా ఉంచాలని వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ ఎం.వి.సునీత అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఉన్న ఆర్‌అండ్‌బీ, ఎం.ఆర్.హెచ్, దాసన్నపేట రైతు బజార్లను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రైతుల గుర్తింపు కార్డులపై ఆరా తీశారు. రైతులు తీసుకొస్తున్న టమాటా, డ్వాక్రా దుకాణాల్లో విక్రయిస్తున్న ఉల్లిపాయలను పరిశీలించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మార్కెటింగ్‌శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస్ కిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ బి.రవికిరణ్, రైతు బజార్ల ఏఓలు చప్ప సతీష్‌కుమార్, ఉమామహేశ్వరరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రంగుల సంబరం



యువతుల సెల్ఫీ సందడి



విజయనగరం రింగురోడ్డు వద్ద ఉన్న మైదానంలో హోలీ కేరింత



విజయనగరం కంటోన్మెంట్‌లో చిన్నారుల హోలీ సందడి

చిన్నాపెద్దా తేడాలేదు.. పేద ధనిక తారతమ్యం లేదు.. శుక్రవారం ఉదయం లేచినప్పటి నుంచి జిల్లా వాసులు హోలీ సంబరాల్లో మునిగిపోయారు. రంగుల్లో తడిసి ముద్దయ్యారు. వీధుల్లో హుషారుగా తిరుగుతూ ఒకరిపైఒకరు రంగులు చల్లుతూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంచిపెట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. పండగ చిత్రాలను సెల్‌ఫోన్‌లలో బంధించి మురిసిపోయారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



రంగుల ముచ్చట



రంగులు పులుముకుంటున్న యువత

మోసపోతున్నా... మౌనమేల?

- తూనికలు, కొలతల్లో ఆదమరిస్తే అంతే సంగతులు
- కొనుగోలుదారులను దోచుకుంటున్న కొంతమంది వ్యాపారులు
- మోసాలు ఎదురవుతున్నా భరిస్తున్న కొనుగోలుదారులు
- అవగాహన లేక హక్కులను వదులుకుంటున్న వైనం
- వినియోగదారుల ఫోరంలో ఏటా వందకు మించని ఫిర్యాదులు
- తూనికలు, కొలతల శాఖ తనిఖీల్లోనూ వందల సంఖ్యలోనే కేసులు
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

ఉదయాన్నే కొనుగోలుచేసే పాలు, పెరుగు ప్యాకెట్‌లపై తేదీ గమనించి గడువు ముగిసినది అంటగడితే వెంటనే ప్రశ్నించాలి.
లేదంటే ఆ మోసాన్ని మనం ప్రోత్సహించినట్టే లెక్క.
కళ్లముందే వివిధ రకాల ఆహార పదార్థాల తూకంలో తేడాలుంటే వెంటనే నిలదీయాలి.
మనకెందుకులే అనుకుంటే తప్పుడు కొలతలకు ఊతమిచ్చినట్టే.
ఎమ్మార్పీ ధరలకు మించి సరుకులు, వస్తువులు విక్రయించినా.. నాణ్యత లోపించిన సరుకులు అంటగట్టినా వెంటనే అధికారులకు ఫిర్యాదు చేసి శిక్ష పడేలా చేయాలి. మోసం చేసినది వ్యక్తి అయినా, సంస్థ అయినా సరే..
ఇందులో అలసత్వం వహిస్తే అక్రమాలను ప్రోత్సహించినట్టే..

చెల్లించిన డబ్బులకు తగిన సేవలు పొందే హక్కును ప్రతీ వినియోగదారుని(కొనుగోలు దారు)కి చట్టం ప్రసాదిస్తోంది. కావాల్సిందల్లా మోసాలను గుర్తించడం.. ప్రశ్నించడమే. వ్యాపారుల్లో ఏమాత్రం మార్పురాకపోయినా, మోసాలకు చెక్‌పెట్టకపోయినా వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక ఫోరం ఉంది. అందులో ఫిర్యాదు చేస్తే చాలు పైసా ఖర్చులేకుండానే న్యాయం పొందవచ్చు. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కులు దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులు, ఫిర్యాదు చేసుకునే వెసులబాటు, జిల్లాలో నమోదైన కేసులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉదయం మేల్కొన్నది మొదలు ఏదో ఒక సరుకు, ఏదే ఒక వస్తువు కొనుగోలు చేస్తూనే ఉంటాం. అదే సమయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఝలక్ ఇచ్చే వ్యాపారులూ ఉన్నారు. కల్తీ చేసినవో, నాసిరకమో, ఎమ్మార్పీ కన్నా ఎక్కువగా వసూలు చేయడమో, తక్కువ పరిణామంలో అంటగట్టడమో... ఇలా తూనికలు, కొలతల్లో, నాణ్యతలో మోసం ఎదురవుతూనే ఉంటుంది. ఇలాంటి మోసాలను ఎదుర్కొనేలా అవగాహన కల్పిస్తూ కొనుగోలుదారుల హక్కులను కాపాడేందుకు ఏటా మార్చి 15వ తేదీన ప్రపంచ వినియోగదారుల హక్కులు దినోత్సవం నిర్వహిస్తున్నారు. అలాగే వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కూడా వినియోగదారుల రక్షణ చట్టం రూపొందించింది. ఇది 1986 డిసెంబర్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. కానీ ఇప్పటికీ సరైన అవగాహన లేక వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. తాము మోసపోయామని తెలిసినా ఫిర్యాదులు చేసేవారూ తక్కువ మందే ఉంటున్నారు. ఈ చట్ట ప్రకారం ఏర్పాటైన జిల్లా వినియోగదారుల ఫోరం (కోర్టు)కు ఫిర్యాదులు కూడా ఏటా వందకు మించట్లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని 2019లో ఈ చట్టం, కోర్టుల పరిధిని ప్రభుత్వం విస్తృతం చేసింది. కోర్టుకు మరిన్ని అధికారాలిస్తూ చట్టాన్ని సవరించింది. ఈ ప్రకారం కోటి రూపాయలలోపు విలువ గల వ్యాజ్యాలు జిల్లా వినియోగదారుల కోర్టు పరిధిలోకే వస్తాయి. ఈ కోర్టులో ప్రస్తుతం 80 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

తూనికలు, కొలతల శాఖ కేసులు పెట్టినా...

తూనికలు, కొలతల్లో మోసాలు, అధిక ధరలకు సరుకుల విక్రయాలను అరికట్టడంలో జిల్లా తూనికలు, కొలతల (లీగల్ మెట్రాలజీ) శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. తరచుగా తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నా కొందరు వ్యాపారులు, ఇతర విక్రయ సంస్థల్లో తీరులో మార్పు రావట్లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సీజనల్ వారీగా కేసులు నమోదు చేస్తున్నారు. ఎరువుల దుకాణాలు, రేషన్ దుకాణాలు, మాంసాహార విక్రయశాలలపై దాడులు చేస్తున్నారు. అదేవిధంగా బంగారం దుఖాణాలు, పెట్రోల్ బంక్‌ల్లో తరచుగా తనిఖీలు చేస్తున్నారు. చేపట్టి మోసాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటున్నారు.



చేపల మార్కెట్‌లో తూకం రాళ్లను పరిశీలిస్తున్న అధికారులు



పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న తూనికల కొలతల శాఖ అధికారి

తూనికలు, కొలతల శాఖ పనితీరు....

సంవత్సరం	కేసులు	అపరాధరుసుం
2019-20	3416	రూ.95.35 లక్షలు
2020-21	3073	రూ.87.16 లక్షలు
2021-22	3009	రూ.95.47లక్షలు
2022-23	1712	రూ.62.26 లక్షలు
2023-24	1265	రూ.45.51 లక్షలు
2024-25	1047	రూ.41.57లక్షలు

మోసాలపై ఫిర్యాదు చేయవచ్చు

తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్
9398145360

విజయనగరం/ చీపురుపల్లి డివిజన్ ఇన్‌స్పెక్టర్ :
8247079822

బొబ్బిలి డివిజన్ ఇన్‌స్పెక్టర్
9398131790

విస్తృతంగా అవగాహన సదస్సులు



వినియోగదారుల హక్కులు, చట్టంపై విస్తృతంగా గ్రామస్థాయి నుంచి అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రజలను చైతన్యం చేయాలి. ఇందుకు వినియోగదారుల మండళ్లు, స్వచ్ఛంద సంస్థలు బాధ్యత తీసుకోవాలి. యువత ముందుకు రావాలి. చట్టం వినియోగదారులకు ఒక ఆయుధం. ఫిర్యాదు చేస్తే కేవలం మూడు నెలల వ్యవధిలోనే పరిష్కరిస్తాం. విచారణ జాప్యం జరుగుతుందనే అపోహ వద్దు. నేరుగా కానీ, న్యాయవాది ద్వారా కానీ బాధితులు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు.

– బంటుపల్లి శ్రీదేవి, జిల్లా వినియోగదారుల కమిషన్, సీనియర్ మెంబర్, విజయనగరం

మోసాలెన్నో...

- ప్రతి ఒక్కరూ ఉదయం లేచిన వెంటనే కొనుగోలుచేసే పాలు, పాల పదార్థాల వద్దే మోసం మొదలవుతోంది. కలెక్టరేట్ పరిసరాల్లోనే ఉన్న ఓ దుకాణంలో పాలు ప్యాకెట్ల విక్రయాన్ని పరిశీలిస్తే ఎమ్మార్పీ కన్నా రూ.2 ఎక్కువ వసూలు చేస్తున్నారు. గత ఏడాది కాలంలో తూనికలు కొలతలు శాఖ అధికారులు తనిఖీ చేస్తే ఇలాంటివి పలు చోట్ల బయటపడ్డాయి. అలాంటి వ్యాపారులపై 58 కేసులు నమోదయ్యాయి. వారి నుంచి వసూలుచేసిన అపరాధ రుసుమే రూ.1.37 లక్షల వరకూ ఉంది.
- చికెన్, మటన్, చేపల దుకాణాల్లోనూ తూకంలో తేడా వస్తోంది. ఆర్అండ్‌బీ రైతుబజారు సమీపంలోని ఓ చేపల దుకాణంలో తూకం తేడా చేస్తున్నారు. ఇలాంటి మోసాలు జరగకుండా తూనికలు, కొలతల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. గత ఏడాది కాలంలో ఇలాంటి మోసాలకు పాల్పడిన వ్యాపారులపై 98 కేసులు నమోదయ్యాయి. వారి నుంచి వసూలైన అపరాధ రుసుం రూ.1.38 లక్షల వరకూ ఉంది.
- కిరాణా, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో జరుగుతున్న అవకతవకలపై గత ఏడాది కాలంలో 208 కేసులు నమోదయ్యాయి. ఆయా వ్యాపారుల నుంచి రూ.5.55 లక్షల వరకూ తూనికలు, కొలతల శాఖ అపరాధ రుసుం వసూలు చేసింది.
- పేదలకు ఇచ్చే సరుకుల్లోనూ తూకం తేడా చేస్తున్నారు. రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాలను తనిఖీ చేస్తే గత ఏడాది కాలంలో 20 కేసులు నమోదయ్యాయి. వారికి తూనికలు, కొలతల శాఖ అధికారులు రూ.71 వేల వరకూ జరిమానా విధించారు.
- రైతులకు ప్రతి దశలోనూ మోసగాళ్లు ఎదురవుతూనే ఉన్నారు. విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ కన్నా రూ.50 నుంచి రూ.200 వరకూ డిమాండును బట్టి వ్యాపారులు అధికంగా వసూలు చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలు గత ఏడాది కాలంలో పలుచోట్ల వెలుగులోకి వచ్చాయి. తూనికలు, కొలతల శాఖ 44 వరకూ కేసులు నమోదుచేసింది. ఆయా వ్యాపారుల నుంచి రూ.5.45 లక్షల వరకూ జరిమానా వసూలు చేశారు. ఇక ధాన్యం విక్రయాల సమయంలోనూ రైతులు మోసపోతూనే ఉన్నారు. తూకంలో అవకతవకలకు పాల్పడుతున్న రైసు మిల్లులపై గత ఏడాది కాలంలో 33 కేసులు నమోదయ్యాయి. వారి నుంచి వసూలైన అపరాధ రుసుం మాత్రం రూ.1.55 లక్షలు మాత్రమే.
- గృహనిర్మాణ సామగ్రి కొనుగోలులోనూ ఆదమరిస్తే మోసపోవడం ఖాయం. ఇనుము తూకం తక్కువగా వేస్తున్నారు. గత ఏడాది కాలంలో ఇలాంటి మోసాలకుపాల్పడుతున్న ఐరన్, స్టీల్ దుకాణాలపై 22 కేసులు నమోదయ్యాయి. వారికి తూనికలు, కొలతల శాఖ విధించిన జరిమానాయే రూ.92 లక్షల వరకూ ఉంది. ఇసుక తూచే వే బ్రిడ్జిల వద్ద కూడా మోసం జరుగుతోంది. గత ఏడాదికాలంలో 50 కేసులు నమోదయ్యాయి. అందుకు బాధ్యుల నుంచి వసూలు చేసిన జరిమానా రూ.2.91 లక్షలు.
- పెట్రోల్ బంకుల్లోనూ మోసాలు జరుగుతున్నాయి. ప్రతి లీటరు వద్ద వంద పాయింట్ల వరకూ పెట్రోల్, డీజిల్ పంపుల్లో కొట్టేస్తున్నారు. ఇది పైకి కనిపించని మోసం. కేవలం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేస్తేనే బయటపడుతున్నాయి. గత ఏడాది కాలంలో బంకులపై 118 కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో అపరాధ రుసుం చాలా తక్కువగా ఉంది. కేవలం రూ. 2.23 లక్షలు మాత్రమే.
- గత ఏడాది కాలంలో బంగారం దుకాణాలపై 12 కేసులు, ఇతర ముఖ్య వ్యాపారసంస్థలపై 80 కేసులు నమోదయ్యాయి.

పదోన్నతుల్లోని లోపాలను సవరించాలి

- విద్యాశాఖ ఆర్‌జేడీకి ఎస్టీయూ జిల్లా కమిటీ సభ్యుల వినతి



ఆర్‌జేడీ విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: విద్యారంగంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో చేపడుతున్న విధానాల్లో లోపాలను సరిచేయాలని ఎస్టీయూ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లాకు వచ్చిన ఆర్‌జేడీ కె.విజయభాస్కర్‌ను శుక్రవారం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. పదోన్నతుల్లో ఎవ్వరికీ అన్యాయం జరగకూడదన్నారు. తరగతులు, మ్యాపింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఎంసీ కమిటీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసికోవాలని కోరారు. బకాయిపడి ఉన్న 50 శాతం పాఠశాల నిర్వహణ నిధులు చెల్లించాలని, గిరిశిఖర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్పెషల్ పాయింట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీఎల్ఐ వంటి ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. ఆర్‌జేసీని కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.మురళి, జిల్లా ఉపాధ్యాయులు టి.నాగేశ్వరరావు, ఎస్.బంగారయ్య, పి.రాంబాబు తదితరులు ఉన్నారు.

ఐసీడీఎస్‌లో ఆకలి కేకలు

- వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్‌హెల్ప్‌లైన్ విభాగాల సిబ్బందికి అందని జీతాలు



వన్‌స్టాప్ సెంటర్ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: ఐసీడీఎస్‌లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. ఐసీడీఎస్ పరిధిలోని వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఏడు నెలలుగా జీతాలు అందకపోవడంతో పస్తులతో గడుపుతున్నారు. ఇంటి నుంచి కార్యాలయానికి రావడానికి రవాణా చార్జీలకు కూడా అప్పుచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అడ్మినిస్ట్రేటర్, కౌన్సిలర్, ఐటీ స్టాఫ్, పారా మెడికల్ వర్కర్ ఒక్కొక్కరు, కేస్ వర్కర్లు ఇద్దరు, హెల్పర్స్ ఇద్దరు, సెక్యూరిటీ గార్డులు ముగ్గురు కలిపి 11 మంది పనిచేస్తున్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌లో నలుగురు పనిచేస్తున్నారు. వీరిలో సూపర్ వైజర్లు ఇద్దరు, కేస్ వర్కర్లు ఇద్దరు పనిచేస్తున్నారు. వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది 11 మందికి గతేడాది ఆగస్టు నుంచి నెలకు రూ.2.50 లక్షల చొప్పున రూ.17.50 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, చైల్డ్‌హెల్ప్‌లైన్ సిబ్బంది నలుగురికి రూ.5.61 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఐసీడీఎస్ ఇన్‌చార్జి డీపీ జి.ప్రసన్న వద్ద 'సాక్షి' ప్రస్తావించగా బడ్జెట్ రాలేదని, వచ్చిన వెంటనే జీతాలు చెల్లిస్తామని చెప్పారు.

ఎందుకంత చిన్నచూపు!



పశువైద్య విద్యార్థులపై కూటమి ప్రభుత్వానికి ఎందుకంత చిన్నచూపని గరివిడి వెటర్నరీ వర్సిటీ విద్యార్థులు ప్రశ్నించారు. కళాశాలకు వీసీఐ గుర్తింపును తీసుకురావాలని, స్టైఫండ్‌ను రూ.25వేలకు పెంచాలని కోరుతూ కళాశాల ఆవరణలో 40 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా స్పందించకపోవడం విచారకరమన్నారు. హోలీ పండగ రోజు అందరి జీవితాలు రంగులమయంగా ఉంటే ఐదు బ్యాచ్‌లకు చెందిన 327 మంది పశువైద్య విద్యార్థుల జీవితాల్లో చీకటి అలముకుందంటూ ప్రధాన గేటు బయట నలుపు వస్త్రాలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

– చీపురుపల్లిరూరల్ (గరివిడి)

శోభాయమానంగా డోలా యాత్ర



సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం గ్రామంలో వెలసిన ఏకాంత సీతారాముల డోలాయాత్ర శుక్రవారం శోభాయమానంగా ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకుడు భోగాపురపు ప్రసాదరావు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆంజనేయ, సర్ప వాహనంపై ఉంచి మేళతాళాలతో ప్రధాన ఆలయం నుంచి పల్లకిలో తిరువీధి జరిపారు. ఉత్తరముఖ మండపంలో స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు రవీంద్ర, ఆలయ ఈఓ బి.మాధవరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– సంతకవిటి

క్లుప్తంగా

సెలవు రోజూ సర్వే

- ఉద్యోగులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం



రామభద్రపురంలో పీ–4 సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రామభద్రపురం: సచివాలయాల ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉంది.కూటమి ప్రభుత్వం రాకతో వారి మీద పని భారం వేసి గొడ్డు చాకిరీ చేయిస్తోంది. పనిదినాల్లోనే కాకుండా సెలవు రోజుల్లో కూడా కనీసం కుటుంబ సభ్యులతో గడపకుండా సర్వే పేరుతో వేధిస్తోంది. శుక్రవారం హోలీ సెలవు రోజున తప్పనిసరిగా పీ–4 సర్వే చేయాలని అధికారులు ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సర్వే చేశారు. రామభద్రపురం మండలంలో ప్రస్తుతం సర్వే చేసుకో..జీతం పుచ్చుకో అన్న వ్యవహారం గ్రామ సచివాలయ ఉద్యోగుల్లో ట్రెండింగ్‌గా మారింది. ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగులపై మెడపై కత్తి పెట్టి మరీ సర్వే చేయిస్తోంది.దీంతో సచివాలయాల ఉద్యోగులు నిద్రలేని రాత్రులు అనుభవిస్తున్నామని పేరు బయటకు చెప్పుకోలేని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారితే చాలు ఏ అధికారి నుంచి ఏ ఫోన్ వస్తుందోనని టెన్షన్ పడుతున్నామని, చివరికి బీపీలు, సుగర్‌లు కూడా వస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సర్వేయర్ల సంఘం ఎన్నిక

- అధ్యక్షుడిగా కాశినాయుడు



గ్రామ సర్వేయర్ల సంఘం నూతన కార్యవర్గం

విజయనగరం ఫోర్ట్: గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాశినాయుడు ఎన్నికయ్యారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా స్టేట్ కోఆర్డినేటర్‌గా భరత్, జిల్లా కార్యదర్శిగా దుర్గా మదీనా, జిల్లాస్పోర్ట్స్ సెక్రటరీగా జగదీష్ , ఉపాధ్యక్షురాలిగా రమాదేవి, జాయింట్ సెక్రటరీగా లక్ష్మీప్రసాద్, జిల్లా ట్రెజరర్‌గా అజయ్‌కుమార్, జిల్లా ఉమెన్ వింగ్ కార్యదర్శిగా యోర్నా సాయి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు అభినందనలు తెలియజేశారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు ప్రదర్శన



పరుగు ప్రదర్శనలో దౌడు తీస్తున్న గుర్రాలు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా ఉల్లాసంగా సాగింది. ఈ గుర్రాల పరుగు ప్రదర్శనలో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 10 గుర్రాలు పాల్గొన్నాయి. ఈ పరుగు ప్రదర్శనలో లక్కవరపుకోటకు చెందిన సింగపూర్ సత్యనారాయణ మురుగన్ గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. రెండోస్థానంలో చేనుల అగ్రహారానికి చెందిన మణి జెస్సీ గుర్రం, మూడోస్థానంలో అంకుపాలానికి చెందిన విజయదుర్గా గుర్రం, నాల్గోస్థానంలో కోటనందూరుకు చెందిన శివరాజు బ్రదర్స్ గుర్రం నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

గడ్డి కుప్పలు దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన ఆలుబిల్లి చంద్రశేఖర్ గడ్డికుప్పలు శుక్రవారం దగ్ధమయ్యాయి. పశువుల దాణా నిమిత్తం పొలంలో కుప్పలు వేసిన గడ్డికుప్పల నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగ ఆక్కడి పరిసరాలను చుట్టుముట్టడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తక్షణమే ఫైర్ అధికారులకు సమాచారం అందించగా ఎస్సై జామి సర్వేశ్వరరావు, సిబ్బంది, శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. వేసవి నేపథ్యంలో ఈ తరహా ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణులు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ ఎస్సై ప్రజలకు అవగాహన కల్పించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹98	₹166	₹176

ఆపదలో ఆరోగ్యమిత్రలు..!

- ఆరోగ్య శ్రీస్థానంలో బీమా కంపెనీ తీసుకొస్తున్న సర్కారు
- ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయోనని ఆందోళన
- ఈనెల 17, 24 తేదీల్లో విధులు బహిష్కరించనున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య మిత్రలు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ) పథకంలో పనిచేసే ఆరోగ్య మిత్రల్లో ఆందోళన నెలకొంది. ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో తెలియక సతమతమవుతున్నారు. ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా కంపెనీని కూటమి సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బీమా కంపెనీని తేవడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే బీమా కంపెనీ వస్తే ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు, టీమ్‌లీడర్లు, ఆఫీస్ సిబ్బందిని కొనసాగిస్తారా? లేదా? అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఈనెల 10వతేదీ నుంచి ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేసే ఆరోగ్య మిత్రలు, టీమ్‌లీడర్లు, ఆఫీస్ సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు ఈనెల 12న వారిని చర్చలకు పిలిచారు. చర్చలు విఫలం కావడంతో ఆరోగ్యశ్రీ సిబ్బంది ఈనెల17, 24 తేదీల్లో విధులు బహిష్కరించనున్నారు.

గత ప్రభుత్వం హయాంలో సంతోషంగా విధులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఆరోగ్య మిత్రలు ఎటువంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా సంతోషంగా పనిచేశారు. ఉన్నతాధికారులు కానీ, జిల్లా అధికారులు కానీ మిత్రలపై ఎటువంటి ఒత్తిడి తెచ్చేవారు కాదు. దీంతో వారు కూడా తాము చేయాల్సిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించేవారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రలు పనిచేస్తారు. ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న వ్యాధులకు చికిత్స కోసం వచ్చే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత వైద్యుడి దగ్గరకు పంపిస్తారు. ఆస్పత్రిలో చికిత్సకోసం కానీ, శస్త్రచికిత్స కోసం చేరినట్లయితే వారికి సకాలంలో చికిత్స, శస్త్రచికిత్స జరిగేలా చూడడం ఆరోగ్య మిత్ర విధి. అదేవిధంగా ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా? లేదా? అని పర్యవేక్షించడం, ఎవరైనా ఆస్పత్రి సిబ్బంది సేవలు అందించడం కోసం చేతివాటం ప్రదర్శించినట్లయితే వారి ఫిర్యాదును కో ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లడం వారి విధి.

విధుల్లో 96 మంది మిత్రలు

ఆరోగ్యశ్రీ పథకంలో జిల్లాలో 96 మంది ఆరోగ్య మిత్రలు పనిచేస్తున్నారు. అదేవిధంగా జిల్లా కోఆర్డినేటర్ ఒకరు, జిల్లా మేనేజర్ ఒకరు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఆఫీస్ అసోసియేట్ ,నలుగురు టీమ్ లీడర్లు పనిచేస్తున్నారు.

జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు 30

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 30 ఉన్నాయి. గజపతినగరం, రాజాం, ఎస్.కోట ఏరియా ఆస్పత్రులు, బాడంగి, భోగాపురం, బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల సీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విజయనగరం, విజయనగరం ఘోషాఆస్పత్రి, అభినవ ఆస్పత్రి ఎస్.కోట, ఎస్.కోట కొలవర్తి ఆస్పత్రి, విజయనగరం సాయి పీవీఆర్ ఆస్పత్రి, సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెంకటరామా ఆస్పత్రి, ఆంధ్ర హాస్పిటల్, మారుతి ఆస్పత్రి, పీజీ స్టార్ ఆస్పత్రి, స్వామి కంటి ఆస్పత్రి, నెఫ్రాప్లస్ ఆస్పత్రి, నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి, ముప్వ గోపాల ఆస్పత్రి, గాయత్రి ఆస్పత్రి, పుష్పగిరి ఐ ఆస్పత్రి, తిరుమల నర్సింగ్ హోమ్, శ్రీనివాస్ నర్సింగ్ హోమ్, జీఎంఆర్ కేర్ ఆస్పత్రి, అమృత ఆస్పత్రి, ఎన్ఆర్ఐ ఆస్పత్రి, వెంకట పద్మ ఆస్పత్రులు నెట్‌వర్క్ పరిధిలో ఉన్నాయి. ఈ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రలు షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నారు.

చర్చలు విఫలం



మా సమస్యలపై ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఈనెల 17, 24 తేదీల్లో విధులు బహిష్కరించనున్నాం. బీమా కంపెనీ పరిధిలోకి వెళ్తే మా ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయో అన్న స్పష్టత లేదు. దీంతో ఏం జరుగుతుందోననే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

జె్రి పోతుల ప్రదీప్, ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఏటీఎం మోసాల ముఠా అరెస్టు




కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంబాబు

- రూ.4లక్షల నగదు, 78 ఏటీఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాంబాబు

పాలకొండ: ఏటీఎంల వద్ద మాటు వేసి డబ్బులు తీసేందుకు వెళ్లిన వారిని మాటల్లో పెట్టి వారి కార్డులు, డబ్బులు దొంగిలించే ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ ఎం రాంబాబు ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ముంబైకి చెందిన అయజ్ ద్వివేది, అప్సర్‌ఖాన్‌లు ఈ ఏడాది జనవరిలో పాలకొండలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద థామస్ అనే వ్యక్తిని మోసగించి ఏటీఎం కాజేసి నగదు విత్ డ్రా చేసుకున్నారు. దీనిపై జనవరి 17న పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు విస్తుగొలిపే విషయాలు వెలుగులోనికి వచ్చాయి. నిందితులిద్దరూ దేశవ్యాప్తంగా ఏటీఎంల వద్ద అత్యంత తెలివిగా మోసగించి నగదు కాజేస్తున్న విషయాన్ని గుర్తించారు. టెక్నికల్ సమస్యలు ఉన్న ఏటీఎంల వద్ద మాటు వేసి ఒకరు బయట వేచి ఉంటారు, మరొకరు లైన్‌లో ఉండి డబ్బులు తీయడానికి వచ్చిన వారికి సహాయం చేస్తున్నట్లు నటిస్తాడు. ఆ సమయంలో వారి పిన్ నంబర్‌ను గుర్తిస్తారు. అనంతరం ఏటీఎం నుంచి కార్డు తీసిన సమయంలో వారి వద్ద ఉన్న కార్డుతో నగదు తీసే వారికి అందించి నిందితుల వద్ద ఉన్న అదే రకం కార్డును అందజేస్తారు. ఈ విధంగా కార్డు మార్చిన తరువాత ఆ కార్డులో ఉన్న నగదు మొత్తం డ్రా చేసుకుని ఆ కార్డును మరొకరిని మోసం చేయడానికి ఉపయోగిస్తుంటారు. ఇందుకోసం వీరు నిరక్షరాస్యులు, వృద్ధులను టార్గెట్ చేసి మోసాలు చేస్తున్నారు. ఇటీవల నిందితులు మరోమారు పాలకొండలో నేరాల కోసం రావడంతో వారి కదలికలపై నిఘాపెట్టి పోలీసలుఉ అరెస్టు చేశారు. అనంతరం వారి నుంచి రూ.4లక్షల పదివేలు నగదు, స్విఫ్ట్ కారు, రెండు ఫోన్లు, 78 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ రాంబాబు వివరించారు. ఆయనతో పాటు సమావేశంలో సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగ మూర్తి ఉన్నారు.

రెండు పశువుల వ్యాన్‌ల సీజ్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్ బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న రెండు పశువుల వ్యాన్‌లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి పెదమానాపురం సంతకు ఒక వ్యాన్‌లో 11, మరో వ్యాన్‌లో ఆరు పశువులను తరలిస్తుండగా పట్టుకుని వ్యాన్ డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు చేశారు.



అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

- కార్మికులకు జీతాలు విడుదల చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విజయనగరం గంటస్తంభం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ నిధులు, కార్మికుల జీతాలకు నిధులు కేటాయించాలని, సొంత గనులు ఇచ్చి, ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం 4 సంవత్సరాలుగా కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మోసపూరిత ప్రకటనలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత గనులు లేక స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే నష్టాలకు కార్మికుల్ని బాధ్యులను చేస్తూ ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు నిలుపుదల చేశారని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులతో తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత ప్రకటనలు ప్రజలు అర్థం చేసుకుంటారని, అప్పుడు ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస, జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రాము, వెంకటేష్ తదితరలు పాల్గొన్నారు.

‘దిశ’ నుంచి ‘శక్తి’

- ఆపదలో ఉన్న మహిళకు భరోసా
- రద్దీ ప్రాంతాల్లో మఫ్టీలో శక్తి టీమ్స్ పహారా



రద్దీ ప్రాంతాల్లో యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్స్

విజయనగరం క్రైమ్: మహిళలకు భద్రత ఇచ్చేందుకు నాడు జగన్ ప్రభుత్వం హయాంలో వినూత్న పంథాలో ‘దిశ’ యాప్‌ను ప్రవేశపెట్టారు. ఆపదలో ఉన్న అమ్మాయి, మహిళ, ఉద్యోగిని ఇలా ఏ రంగంలో ఉన్న ఆడవారికైనీ గత జగన్ ప్రభుత్వం ‘దిశ’ యాప్‌ను ప్రవేశపెట్టి భరోసా, భద్రత కల్పించింది. దాని స్థానంలో ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ‘శక్తి’మొబైల్ యాప్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ‘శక్తి’ యాప్‌ను ప్రతి ఒక్క అమ్మాయి, మహిళ, గృహిణి, ఉద్యోగిని వినియోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. మహిళలకు రక్షణ కవచంగా నిలిచే ‘శక్తి’ మొబైల్ యాప్‌ను స్వచ్ఛందంగా డౌన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళల భద్రతకు ప్రత్యేకంగా ‘శక్తి’ మొబైల్ యాప్‌ను ప్రతి మహిళ, యువత తన మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ‘శక్తి’ యాప్ మొబైల్ ఫోన్‌లో నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో పోలీసుల సహాయం సులువుగా పొందవచ్చని చెప్పారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయాల్లో ‘శక్తి’ యాప్ రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. ఆపద సమయాల్లో సదరు మహిళలు పోలీసులకు సమాచారం అందించలేని పరిస్థితుల్లో కూడా ఈ మొబైల్ యాప్ పని చేస్తుందని చెప్పారు. అటువంటి సమయాల్లో కేవలం మొబైల్ ఫోన్‌ను గాలిలో షేక్ చేసినా, వారున్న లొకేషను, ఆడియో, వీడియో వివరాలు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు చేరుతాయని, తద్వారా తమ సిబ్బంది సకాలంలో స్పందించి, కారకులైన వ్యక్తులపై చర్యలు చేపట్టి, బాధితులకు రక్షణగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు, విద్యార్థినులు తాము ఆపదలో ఉన్నామని భావిస్తే యాప్‌లోని ఎస్ఓఎస్. బటన్ ప్రెస్ చేయాలని సూచించారు. రాత్రి సమయాల్లో మహిళలు నైట్ షెల్టర్లలో వేచి ఉండేందుకు దగ్గరలో ఉన్న నైట్ షెల్టర్ల వివరాలు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, హక్కులు, సమీపంలోని పోలీస్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు, హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కొత్తగా రూపొందించిన శక్తి టీమ్స్ జిల్లాలోని ఆర్టీసీ కాంప్లెక్సులు, బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్లు, కళాశాలలను సందర్శించి, మహిళలు, విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు చెప్పారు.

హెల్త్‌వలంటీర్ల నియామకం..

ప్రకటనలకే పరిమితం

- రోగమొస్తే విద్యార్థులకు అవస్థలే



ఆశ్రమపాఠశాల విద్యార్థులు

సీతంపేట: గిరిజన విద్యాసంస్థల్లో హెల్త్ వలంటీర్ల నియామక ప్రక్రియ ప్రకటనలకే పరిమితమైంది. ఈ విద్యాసంవత్సరం మరో నెలరోజుల్లో ముగియనుంది. ఇంకా ఎప్పుడు హెల్త్ వలంటీర్లను ప్రభుత్వం నియమిస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు, అటు విద్యాసంస్థల యాజమాన్యాలు తలపట్టుకునే పరిస్థితి నెలకొంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలు, 18 పోస్టు మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వాటిలో దాదాపు 15 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. ఆయా విద్యాసంస్థల్లో ఉచిత, భోజన వసతి కల్పిస్తూ విద్యాబోధన అందిస్తున్నారు. విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినప్పుడు ప్రాథమిక వైద్యసేవలు అందించడానికి వీలుగా హెల్త్ వలంటీర్‌లను నియమించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో ఏఎన్ఎంలను నియమిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు అది ప్రకటనలకే పరిమితమైంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బాధ్యతలు చేపట్టిన తర్వాత వెంటనే హెల్త్ వలంటీర్‌లను నియమిస్తామని గిరిజన సంఘాలకు హామీ ఇచ్చినా ఇంతవరకు పట్టించుకోలేదు.



స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి (ఫైల్)

ఒక్కో పాఠశాలలో 250 నుంచి 640 మంది విద్యార్థులు

గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో కనీసం 250 నుంచి 640 వరకు సరాసరి విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు జ్వరం, ఇతర వ్యాధులు వచ్చినప్పుడు వెంటనే ప్రథమ చికిత్స చేయడం, బాలికా విద్యాసంస్థల్లో విద్యార్థినులకు నెలసరి సమయంలో కడుపులో నొప్పి ఇతర సమస్యలకు సరైన ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంది. అవసరమైతే దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీకి తరలించాలి. హెల్త్ వలంటీర్‌లు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో పాఠశాల సిబ్బందే ఆస్పత్రికి తరలిస్తున్నారు. వారి పని ఒత్తిడి వల్ల ఆస్పత్రులకు తీసుకువెళ్లడం ఒకటి రెండు రోజులు జాప్యం జరిగితే విద్యార్థుల ఆరోగ్యం విషమించే పరిస్థితి ఉంది. హెల్త్ వలంటీర్‌లను నియమిస్తే ఈ సమస్య ఉండదు. వారే ఆస్పత్రికి తీసుకువెళ్తారు. నెలలో సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్లు ఒకసారి ఆయా పాఠశాలలను విజిట్ చేసి విద్యార్థులకు అనారోగ్య పరిస్థితులు ఉంటే చెక్ చేసి మందులు పంపిణీ చేస్తున్నారు.

గతంలో విద్యార్థుల మృతి ఇలా..

సీతంపేట ఐటీడీఏ పరిధి సరుబుజ్జిలి ఆశ్రమపాఠశాలలో చదువుతున్న సామరెల్లి గ్రామానికి చెందిన సవర రష్మిత గతేడాది జూలైనెలలో జ్వరంతో మృతి చెందింది. అదేనెలలో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలో ఆరోతరగతి విద్యార్థి పి.రాఘవ అనారోగ్యంతో మృతిచెందాడు. అలాగే ఇదే నెలలో జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థి బి.ఈశ్వరరావు మృతి చెందాడు. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గిరిజన సంక్షేమ పాఠశాలకు చెందిన ఎనిమిదోతరగతి విద్యార్థిని అవంతిక డెంగీతో మృతి చెందింది. ఇలా ఆశ్రమపాఠశాలల్లో మరణ మృదంగం వినిపిస్తున్నా ప్రభుత్వం కిమ్మనకపోవడం గమనార్హం.

గ్రామ సచివాలయ ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తున్నారు



గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న ఏఎన్ఎంలు ఆశ్రమపాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేపడుతున్నారు. అత్యవసర సమయంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. కొత్త ఏఎన్ఎంలను నియమించాల్సి ఉంది.

అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ, సీతంపేట ఐటీడీఏ